

చెహోవ్ కథ

# ఒక చలిరాత్రి

తెల్లవారుజామున మూడైంది. పోస్టాఫీసు ముందర ఓవర్ కోటు వేసుకుని తలమీది టోపీ చెవులమీదికి లాక్కుంటూ నిలుచున్నాడు మెయిల్‌మాన్. తపాలా బస్తాలు బగ్గీలో వేస్తున్నారు. నిద్రమత్తులో వున్న క్లర్కు ఫారాలు నింపి సంతకం చెయ్యమంటున్నాడు.

"మా అల్లుడు స్టేషన్‌కెళ్లాలి. బండీలో తీసికెళ్లరాదూ." తపాలా బండీలో ప్రయాణీకుల్ని అనుమతించకూడదని రూలున్నది.

"చదువుకుంటున్న పేద కుర్రాడు. బాడుగ చెల్లించి ప్రయాణం చెయ్యగల స్తోమత వాడికి లేదు."


"సర్లే." అన్నాడు మెయిల్‌మాన్ కాదనలేక.

బండీలో డ్రైవర్ "చలో" అంటూ అరిచాడు.

"డ్రైవర్ పేరేమిటి?"

"సెమియోన్."

మెయిల్‌మాన్ ఫారాల మీద సంతకం పెట్టి బండీ ఎక్కాడు. చీకటిగా, నిర్మానుష్యంగా వున్నది. గుర్రాలు పరుగుకు సిద్ధమవుతున్నాయి. సూట్‌కేస్ తీసుకుని కుర్రాడు కూడా వచ్చి కూర్చున్నాడు. డ్రైవర్ కాలుస్తున్న చుట్ట వెలుగుతప్ప కనుచూపు మేరలో ఒక్క దీపం కూడా లేదు.



మెయిల్‌మాన్ తపాలా సంచుల్ని మరోసారి లెక్క చూసుకున్నాడు. బెరుకుగా, ఒకవైపుకు ఒదిగి కూర్చున్నాడు కుర్రాడు. డ్రైవరు కాలుస్తున్న చుట్ట ఆరిపోయింది. క్లర్కు గేటుదాకా వచ్చి గుడ్‌బై చెబుతూ, అల్లుడితో,

"వెళ్లిరారా బాబూ. మీ అమ్మను అడిగానని చెప్పు" అనీ, మెయిల్‌మాన్‌తో "ఆ పార్సెల్ కాస్త మా ఫ్రెండ్ కిస్తావుగదూ." అంటూ చెయ్యి వూపాడు.

డ్రైవరు తన సీటు అడ్జస్టు చేసుకుని, ముక్కుచీది, కళ్లెం ఎడమచేతిలోకి తీసుకొని, కొరడాతో గుర్రాల్ని పలకరించాడు.

గంటల చప్పుడుతో ప్రయాణం ప్రారంభమైంది. జనసంచారం లేకపోవడంవల్ల దారి విశాలంగా కనిపించింది. చెట్లు, యిళ్లు, మనుషులు ప్రకృతి అంతా గాఢ నిద్రలో వుంది. మినుకు మినుకు మంటున్న చుక్కల కింద తేలుతున్న చిన్న మబ్బులు తూర్పున నలుపు ఎరుపుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. రాత్రి వాతావరణమే మురికిగా, కరుకుగా వుంది. చాకులా చర్మాన్ని కోసే చల్లటి శీతగాలి.

మాట్లాడకపోతే బాగుండదేమోననుకుని కుర్రాడు, మర్యాదగా, బిడియంగా,

"వేసవిలో అయితే యిప్పటికే తెల్లారిపోతుంది. ఇప్పుడేమో కళ్లు పొడుచుకున్న కనిపించని చీకటి... ఆకురాలు కాలం వచ్చేసింది. అదిగో దూరంగా కనిపిస్తున్న మూడు వరుస నక్షత్రాలు. అందులో ఒకటి శుక్రుడు." అంటూ మాట కలిపాడు ఆకాశం వైపు చూపిస్తూ.

చె తే ంలం ముడుచుకొని, కళ్లు మూసుకున్న మెయిల్‌మాన్ ఈ మాటలు వినిపించుకోనే లేదు. శుక్రుడెవరికెక్కావాలి! రోజూ చూసే చుక్కలే.

"తెల్లారటానికింకెంత టైముందంటారూ?" అంటూ మళ్లీ పలకరించాడు కుర్రాడు.

"ఏమిటీ?"

"ఎప్పుడు తెల్లారుతుంది?"

"అయిదు తర్వాత." అన్నాడు డ్రైవరు.

బండీ వూరు దాటింది. కూరగాయల తోటలకు నాటిన కంచెలు దారికిరువైపులా. అక్కడక్కడా అడవిలా వ్యాపించిన విల్లో వృక్షాలు. మసకమసకగా వుంది. ఈ బయలు ప్రదేశంలో చంద్రుడు పెద్దగా

రష్యన్‌మూలం: చెహోవ్.
తెలుగు గొంతు: కరుణారుణ

కనిపించాడు. చలిగాలితోపాటు మంచు కురుస్తున్నది. మెయిల్ మాన్ మరింత ముడుచుకొని కూర్చున్నాడు. చలికి తట్టుకోవడం కష్టంగా వుంది కుర్రాడికి. మొహమూ, చేతులూ గడ్డకట్టుకుపోతున్నాయి. గుర్రాల పరుగు తగ్గింది. దూరంగా చెరువులో ప్రతిఫలిస్తున్న చంద్రవంక. దారిలో నీళ్లున్నాయో, చిల్లి మొహంమీద పడ్డాయి.

ఏమైందో ఏమోకాని మరో పది నిమిషాల్లో చుక్కలు కూడా కనిపించలేదు. చీకటి మరింత దట్టమైంది. బండి అడవిదారిలోకి ప్రవేశించింది. చెట్టుకొమ్మలు మొహానికి బెత్తం దెబ్బల్లా తాకుతున్నాయి. చెట్లకున్న దుమ్మూ, ధూళీ మొహానికి పట్టేసింది. నేలమీదికి పాకిన చెట్ల వేళ్ల మీద బండీ తూలుతూ పోతున్నది తాగుబోతులాగ.

"బండీని దారి మధ్యలో నడపవయ్యా బాబూ! కొమ్మలతో ఒళ్లు చీరుకుపోయేట్టుంది" అంటూ కసిరాడు మెయిల్ మాన్.

మరుక్షణం బండి పల్టీ కొట్టేదే. గుర్రాలు అదుపుతప్పి దౌడు తీస్తున్నాయి. చక్రాలు విరిగినా దిక్కులేదు. గుర్రాలు ఏదో చూసి భయపడ్డట్టున్నాయి. డ్రైవరు మాట కూడా వినటం లేదు.

"రాక్షసి గుర్రాలు. ఆగండహే" అంటూ కళ్లెం లాగాడు డ్రైవర్. బండి ఎగిరెగిరి పడుతున్నది. ముగ్గురూ బండిలోంచి పడిపోయేటట్టున్నారు. కుర్రాడు తపాలా సంచులను పట్టుకొని కూర్చోవడానికి ప్రయత్నించాడు. కాని అవికూడా నిలకడగా లేవు. చక్రానికేదో అడ్డొచ్చింది. బండి గాలిలోకి లేచింది. డ్రైవర్ నిస్సహాయంగా గుర్రాలను ప్రార్థించాడు. కుర్రాడు ఎగిరి డ్రైవర్ సీట్లో పడ్డాడు. నొసలు బండి వూచకు తగిలి చిట్లింది. ఆ క్షణాన గుర్రాలనాపటానికి ఎవరితరమూ కాదు. రాక్షసుడు విసిరేస్తే దొర్లిపోతున్నట్టుగా వున్నది. బండి అడవిని దాటి, కుడివైపుకు తిరిగి, కర్రవంతెనను దాటి ఒక్కసారిగా ఆగింది. కుర్రాడు మరోసారి ముందుకు పడిపోయాడు.

డ్రైవరూ, కుర్రాడు యిద్దరూ రొప్పుతున్నారు. మెయిల్ మాన్, ఒక తపాలా సంచీ, కుర్రాడి సూట్‌కేస్‌తో సహా దారిపక్కనెక్కడో గిరాటేసినట్టుగా పడిపోయాడు.

"యూ, స్కౌండ్రెల్. ఆగరా వెధవా." అంటూ అరిచాడు మెయిల్ మాన్ బాధగా, కోపంగా. లేచి దుమ్ము దులుపుకొని, కుంటుతూ వచ్చి డ్రైవరును నోటికొచ్చిన తిట్లన్నీ తిట్టాడు.

"గండం గడిచిందిరా దేవుడా. ఒక్క గుర్రం మంచిది కాదు. దానికి పొగరెక్కువ. బండీ లాగటం యింకా అలవాటు కాలేదు. పల్లంలో పరిగెత్తమంటే దానికి పిచ్చెక్కిపోతుంది. దీని కొవరమణుస్తాను చూడు." అంటూ కొరడా లేపాడు డ్రైవర్. మెయిల్ మాన్ బూతులు ఆపలేదు. కిందపడిన తపాలా సంచీ మళ్లీ బండిలోవేసి కాసేపు పగ్గాలు పట్టుకొని నడిచాడు డ్రైవర్.

ప్రాణం అరచేత పట్టుకున్న కుర్రాడు ప్రమాదం తప్పినందుకు ఊపిరి పీల్చుకున్నాడు. చీకట్లో, తపాలా బండిలో, పొగరుమోతు గుర్రాల్తో ప్రయాణం వాడికి తొలి అనుభవం.

"నాకు రెండు మూడుచోట్ల దెబ్బలు తగిలాయి. మీరు కింద పడిపోవడం నేను గమనించలేదు. అబ్బా, ఏమి గుర్రాలు." అన్నాడు కుర్రాడు సానుభూతిగా.

మెయిల్ మాన్ మాట్లాడలేదు.

"ఎంతకాలంగా ఈ ఉద్యోగం చేస్తున్నారు

"గండం గడిచిందిరా దేవుడా. ఒక్క గుర్రం మంచిది కాదు. దానికి పొగరెక్కువ. బండీ లాగటం యింకా అలవాటు కాలేదు. పల్లంలో పరిగెత్తమంటే దానికి పిచ్చెక్కిపోతుంది. దీని కొవరమణుస్తాను చూడు."

మీరు?" కుర్రాడు.

"పదకొండేళ్లుగా."

"అంటే రోజూ ఈ ప్రయాణం."

"ఆఁ. రోజూ. ఈ తపాలా సంచులు అక్కడ వేసిన వెంటనే తిరుగు ప్రయాణం కూడా."

పదకొండేళ్ల నిత్య ప్రయాణాల్లో ఇలాంటి అడ్వెంచర్లెన్నో. వేసవి రాత్రులు. మబ్బులు పట్టిన శిశిర రాత్రులు. శీతకాలంలో, గడ్డకట్టించే చలిలో, దారి కనిపించని మంచు తుఫానుల్లో, ఏ క్షణం ఏమవుతుందో తెలియని గాఢాంధకారంలో. ఎన్నెన్ని గుర్రాలో... ఎన్నెన్ని రకాల బళ్లో... దారిలో దోపిడీ దొంగలు...

"తపాలా తీసుకెళ్లడం చాలా డేంజరెస్‌గా వుంటుందన్న మాట."

"మెయిల్ మాన్ ఏమన్నా చెబుతాడేమోనని ఆశించాడు కుర్రాడు. కాని అతడు కదల్లేదు. మెదల్లేదు."

తెల్లారవచ్చింది.

డ్రైవర్ దారి చూడగలుగుతున్నాడు. చంద్రవంక కాంతి తగ్గి తెల్లబడింది. మెయిల్ మొహం చలిగాలికి కందగడ్డలాగైంది. తగిలిన దెబ్బలతో, అవమానంతో కోపంగా వున్నాడు.

"హమ్మయ్య, యిప్పటికి తెల్లారింది." అన్నాడు కుర్రాడు. "సెప్టెంబర్ నెలలో వుదయం ఎంత చల్లగా వున్నా, ఎండరాగానే వెచ్చబడుతుంది. మనం స్టేషన్ చేరుకున్నట్టేనా?"

మెయిల్ మాన్ బాధగా చూశాడు.

"ఒక్కక్షణం కూడా వాగకుండా వుండలేవా?" ఛ. రాత్రంతా ఒకటే గోల.

కుర్రాడు సిగ్గుపడ్డాడు. మళ్లీ నోరెత్తలేదు. తెల్లారినా చలి తగ్గలేదు. మెయిల్‌మాన్ చిరాకు కుర్రాడికి అంటుకుంది. చలికి గజగజ వణికితే కోపం రాదా! పాపం, చెట్లు ఈ చలిని ఎలా భరిస్తాయో! పుస్తకాల్లో రాసినట్లుగా చెట్ల చివరల మీది సూర్యకాంతి ముగ్ధమనోహరంగా ఏమీ లేదు. పక్షులు చప్పుడు చేశాయి. అవి కిలకిలా రావాలేమీ కాదు. సూర్యుడు కూడా చల్లగానే వున్నాడు. వణుకు యింకా వదల్లేదు.

దూరంగా తలుపులు, కిటికీలు మూసిన యిళ్లు. వాటివెనక వెచ్చగా, ముడుచుకుని పడుకున్న మనుషులు. వాళ్లకు చలిలేదు. ఈ మెయిల్ మాన్ క్రూరమైన మొహాన్ని వాళ్లు చూడక్కరలేదు. తపాలా బండి గంటల చప్పుడుకు ఏ పడుచుపిల్లయినా నిద్ర లేచినా, మళ్లీ అటు తిరిగి పడుకొని మరింత తియ్యటి కలలు కంటుంది.

గడ్డకట్టే ఈ నీళ్లల్లో చేపలెలా ఈదుతాయో.

"తపాలా బండిలో ప్రయాణీకుల్ని పర్మిట్ చెయ్యరు. అది రూల్సుకు విరుద్ధం. అందువల్ల ఎవరూ అలాంటి కోరికలు కోరకూడదు. ఒక మనిషి వస్తే నాకేదో యిబ్బందని కాదు. కాని అది పద్ధతి కాదు." అంటూ ప్రకటించాడు మెయిల్ మాన్.

"ముందే చెప్పాల్సింది మరి." అన్నాడు కుర్రాడు. మెయిల్ మాన్ మాట్లాడలేదు కాని అసహ్యంగా చూశాడు. బండి స్టేషన్ ముందర ఆగింది. కుర్రాడు థాంక్స్ చెప్పి దిగిపోయాడు.

రైలింకా రాలేదు. అటువైపు పట్టాల మీద గూడ్సు బండి ఆగి వున్నది. ఇంజన్ డ్రైవరూ, అతడి అసిస్టెంట్ ప్లాట్‌ఫారంమీద టీ తాగుతూ నిలుచున్నారు. రైలు బోగీలు, ప్లాట్‌ఫాం, బెంచీలు అన్నీ మంచుతో కప్పబడి ఉన్నాయి.

కుర్రాడు వెయిటింగ్ రూంలో రైలు కోసం నిరీక్షించాడు. మెయిల్ మాన్, ఓవర్ కోట్ జేబుల్లో చేతులు దాచుకొని ప్లాట్‌ఫాం మీద పచారు చేశాడు. తనకే తెలియని కోపం. విసుగు. అసహనం.

ఎవరిమీద ఆ కోపం? సాటి మనుషుల మీదా? పేదరికం వల్లా? శిశిర రాత్రుల జ్ఞాపకం వల్లా? ■